క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కన్నాయిగూడెం: మండలంలో నూతనంగా ఎంఈఓగా శ్రీనువాస్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీనువాస్‌రావు ముప్పనపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎంగా కొనసాగుతున్నారు. కాగా, బాధ్యతలు చేపట్టిన ఎంఈఓను మండలంలోని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, నర్సింహారావు, రమేశ్ తదితరులు ఉన్నారు.

సన్మానం



కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి మండల పరిషత్ పాఠశాలలోని ఉపాధ్యాయుడు చంద్రయ్య ఉద్యోగ విరమణ పొందాడు. దీంతో చంద్రయ్య దంపతులను తోటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారావు, అంజయ్య, సీఆర్పీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందజేత



వెంకటాపురం(కె): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్‌కు గత నెల 29న హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నేషనల్ డాక్టరేట్ అవార్డు అందజేశారు. ఆసియా వేదిక్ అంతర్జాతీయ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సొసైటీ ఇండియా ఎన్‌జీఓల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సాయి ప్రకాష్‌కు సోషల్ సర్వీసెస్ డాక్టర్ అవార్డు, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఆఫ్ ఇండియా తరుపున భారతీయ స్ఫూర్తి సేవారత్న నేషనల్ అవార్డు ప్రదానం చేశారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం పలు సేవలు చేస్తుండడంతో ఈ అవార్డును చేయూత ఫౌండేషన్ సహాయకుడు విజయ్ అందజేశారు.

ఆర్థికసాయం



కన్నాయిగూడెం: మండల కేంద్రానికి చెందిన దాస్యం శ్రీను, దేవాదులకు చెందిన బోట రఘుబాబు పలు కారణాలతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య కార్యకర్తలతో కలసి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిలుముల రాంబాబు, పూజారి కిషోర్, వెంకటేష్, జగన్, కేశ్వరావు, శ్రీనువాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి

ములుగు రూరల్: హరితహారం కార్యక్రమంలో రోడ్లకు ఇరువైపులా నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. కోనోకార్పస్ మొక్కల వల్ల అలర్జీ, శ్వాస సంబంధిత, కిడ్నీ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని డీఆర్డీఓ విభాగాలకు ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. అయినప్పటికీ జిల్లా కేంద్రంలోని బిట్స్ పాఠశాలలో కోనోకార్పస్ మొక్కలను తొలగించలేదని అన్నారు. పాఠశాలలో చిన్నారులు 500 మంది ఉన్నారని అన్నారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. అధికారులు స్పందించి మొక్కలను వెంటనే తొలగించాలని అన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీపీ మృతి



ఆగయ్య(ఫైల్)

మంగపేట: మండలంలోని కమలాపురానికి చెందిన మాజీ ఎంపీపీ కల్యాణపు ఆగయ్య (86) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం గుండె నొప్పి రావడంతో వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం పొందుతున్న ఆయన రాత్రి మృతి చెందాడు. కమలాపురం బిల్టు ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తు వామపక్ష ఉద్యమాల నాయకుడిగా దశాబ్ద కాలంగా పని చేశారు. మొదటగా ఆయన కమలాపురం సర్పంచ్‌గా ఎన్నికై, అనంతరం కమలాపురం 02వ ఎంపీటీసీ సభ్యుడిగా సీపీఎం తరుపున గెలిచి ఎంపీపీగా పదవి బాధ్యతలు నిర్వహించారు. కాగా, ఆగయ్య మృత దేహానికి సోమవారం రాజకీయ పార్టీల నాయకులు, ప్రజ సంఘాల నేతలు నివాళులర్పించారు.

కోతలు.. వెతలు!

వేళాపాళా లేకుండా కరెంట్ కట్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్

మంగపేట: ఎప్పుడు పోతుందో తెలియదు. ఎప్పుడొస్తుందో తెలియదు. వేళాపాళా ఉండదు. ముందస్తు సమాచారం అస్సలే ఉండదు. ఇష్టారీతిన నిలిపేస్తారు. అంతటా వర్షం పడితే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. కానీ మంగపేటలో వర్షం పడినా, ఎండకొట్టినా ఆఖరికి ఫ్యూజ్ పోయినా గంటలకు గంటలు సరఫరా నిలిపిస్తారు. అసలే వర్షాకాలం ఆపై దోమల భారం.. వీటన్నింటి నడుమ విద్యుత్ కోతలు.. ప్రజలకు వెతలు మిగిలిస్తున్నాయి. ఏళ్లగా ఉన్న ఈ సమస్యకు పరిష్కారం చూపే వారే లేరా? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎక్కడ సమస్యొచ్చినా.. మండలమంతా కట్

మల్లూరు 33/11 కేవీ పరిధి వివిధ గ్రామాల వినియోగదారులు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎక్కడి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పోయినా, ఏచిన్న సమస్య తలెత్తినా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలన్నింటికీ సరఫరా పూర్తిగా నిలిపేస్తున్నారు. దీంతో గృహ వినియోగదారులు, రైతులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా సబ్‌స్టేషన్ ఉన్న గ్రామానికి 24 గంటల పాటు సింగిల్ ఫేజ్ సరఫరా ఇచ్చేలా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా 20 ఏళ్ల నుంచి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ట్రాన్స్‌కో సిబ్బంది ఉన్నా వారి సహాయకులుగా ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని వారిచేత పనులు చేయిస్తూ చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రైవేట్ వ్యక్తులతో మరమ్మతు!

మండలంలో ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తితే ప్రత్యక్షంగా సంబంధిత అధికారి మరమ్మతు చేయాలి. కానీ వారు చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా సమస్య వస్తే సంబంధిత లైన్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపి వేసి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా.. కరెంట్ ఆన్ ఆఫ్ చేసే సెట్ పని చేయడం లేదనే సాకుతో మొత్తంగా సబ్‌స్టేషన్‌లో సరఫరా పూర్తిగా నిలిపేస్తున్నారు. దీంతో ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా ఇతర గ్రామలకు సరఫరా నిలిచిపోతోంది. నిత్యం 10 నుంచి 15 సార్లు కరెంటు వచ్చి పోతుండడంతో విలువైన ఫ్రిజ్‌లు, టీవీలు, కంప్యూటర్లు పాడైపోతున్నాయని వినియోదగదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఎక్కడైనా సమస్య ఉంటే అక్కడి వరకు విద్యుత్ నిలిపేసి మరమ్మతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఇతర గ్రామాలకు సరఫరా నిలిపివేయకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

8 గంటలు కరెంట్ నిలిపివేత

మల్లూరు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో పీటీఆర్, లింబు పాడై పోయాయని మరమ్మతులు చేస్తున్నామని సోమవారం మధ్యాహ్నం 01 గంట నుంచి రాత్రి 8.45 గంటల వరకు కరెంటు సరఫరాను పూర్తిగా దాదాపు 8 గంటలు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం ఉదయం సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం ఏర్పడిందని బ్రేకర్ ట్రిప్ కాకుండా డైరెక్టుగా సరఫరా చేయడంతో రాత్రి 09 గంటల సమయంలో గ్రామంలో 11 కేవీ విద్యుత్ వైర్ మూడు చోట్ల తెగిపడింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నా కరెంటు సరఫరా నిలిచి పోకపోవడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చి సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో కరెంటు సరఫరా నిలిపివేశారు. ఎట్ట కేలకు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సాయంతో మరమ్మతు చేసి రాత్రి 12 గంటలకు తిరిగి కరెంటు పునరుద్ధరించారు.

ఇబ్బందులు పడుతున్నాం..



నిత్యం కరెంటు సరఫరా నిలిచి పోతుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. 11 కేవీ వైర్ తెగిపడటంతో మోటారు, కాలిపోయింది. పలువురికి చెందిన ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కాలిపోయాయి. ఎక్కడ చిన్న సమస్య వచ్చినా సమయం సందర్భం లేకుండా కరెంటు సరఫరా నిలిపి వేస్తున్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే అక్కడి వరకు విద్యుతు నిలుపివేసి మరమ్మతులు నిర్వహించేలా చర్య తీసుకోవాలి.

- సత్యనారాయణ, మల్లూరు

మరమ్మతుల సమయంలోనే నిలిపివేత

సబ్ స్టేషన్, విద్యుత్ లైన్లలో తలెత్తిన సమస్యను పరిష్కరించి సరఫరా పునరుద్ధరించేందుకు మరమ్మతు చేసే సమయంతో మాత్రమే సరఫరా నిలిపివేస్తున్నాం. ప్రధానంగా సబ్ స్టేషన్‌లో లింబులు, పీటీఆర్ వంటివి ఫెయిల్ కావడంతో సమస్య తెలెత్తింది. మరోసారి సమస్య రాకుండా చూస్తాం.

- ట్రాన్స్‌కో ఏఈ ప్రశాంత్‌రెడ్డి, మంగపేట

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో విద్యార్థులు

ఏటూరునాగారం: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవలో కార్యక్రమాల్లో అందరు భాగస్వాములు కావాలని అంబేడ్కర్ యువజన సంఘం యూత్ లీడర్ కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు యువత భాగస్వామ్యం చేసుకోని శ్రమదానం చేయాలన్నారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని అన్నారు. మొక్కలు నాటడం, తడి చెత్త పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రిన్స్‌పాల్ అశోక్, అధ్యాపకులు మామిడి శంకర్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



ఫోన్ అందజేస్తున్న ట్రైనీ ఎస్సైలు హేమలత, దివ్య

రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు ట్రైనీ ఎస్సైలు హేమలత, దివ్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన దేవేందర్, రేపాకపల్లి గ్రామానికి చెందిన నాయిని కుమార్ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వివరాలు నమోదు చేసి ఫోన్లని గుర్తించి బాధితులకు అందజేశారు.

వైద్యశిబిరం

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట గ్రామంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో ఆదివారం శునకాల దాడిలో గాయపడిన బాధితులను సందర్శించి వారికి వ్యాక్సిన్ వేశారు. కుక్క కాటుపై నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి తెలిపారు. కుక్కలు, కోతుల దాడిలో గాయపడితే యాంటీ రాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా జీవించాలి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఆర్‌ఐ సురేందర్‌రెడ్డి




చిట్యాల: మాట్లాడుతున్న ఎస్సై ఎండి.శాఖాన్

మొగుళ్లపల్లి: కులాలలకు, మతాలకు అతీతంగా ప్రజలు జీవించాలని ఆర్‌ఐ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో అంటరానితనం, అమనూషముపై పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదని అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో సంబంధిత అధికారులు మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెకండ్‌ఎస్సై ఎండి.శాఖాన్ హాజరై మాట్లాడుతూ.. దళితులను చిన్నచూపు చూడోద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో సోమవారం పౌర హక్కులపై తహసీల్దారు విజయలక్ష్మీ, ఏఎస్సై అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అందరూ ఒకటేనని, ఎస్సీ, ఎస్టీలను వేరు చేసి, వివక్ష చూపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విజయయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీన్‌కుమార్, గందం సురేష్, బట్టల కుమార్, మహిళా కానిస్టేబుల్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న బందు సాయిలు

పలిమెల: బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని, దీని ద్వారా దేశాభివృద్ధికి ప్రజా ప్రయోజనాలకు తీరని నష్టం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల ప్రథమ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సూదుల శంకర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం బందు సాయిలు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులు, ఆదివాసీలు, కార్మికులు, పేద ప్రజలపై అమానుషమైన దాడులు దౌర్జన్యాలు కొనసాగిస్తూ, హింసను ప్రజలలో ప్రేరేపిస్తుందన్నారు. అటువంటి బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని ప్రతినిధులకు సూచించారు. అదే విధంగా బీజేపీ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలల్లో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్, పార్టీ సభ్యులు ఆత్మూరి శ్రీకాంత్, పాగే పాట్టయ్య, పెద్ద శేఖర్ ఉన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కాటారం: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరికి సంబంధించి అంశాలను సీఈఓ ఎడ్ల సతీశ్ సభలో వివరించారు. పీఏసీఎస్ ఉద్యోగుల రెగ్యూలరైజేషన్, రూ.రెండు లక్షల రుణమాఫీ, లావాణీ పట్టా భూములకు రుణాల మంజూరు ప్రతిపాదనలపై పాలకవర్గం చర్చించి, తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, చీమల సత్యం, జక్కుల అజయ్, ఐలి రాజబాబు, రాజేశ్వరీ, బాసాని హిమాకర్, రైతులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి తోడ్పడాలి

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాడాలని మహాముత్తారం పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం లావాదేవీలు, ఖర్చులు, లాభాలు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. రైతులకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్టర్ రాజు, వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పీఏసీఎస్ చేయూత

మల్హర్: రైతులకు అన్ని రకాల రుణాలు అందించి వారికి పీఏసీఎస్ ద్వారా చేయూతనందిస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. మండలంలోని తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం పీఏసీఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొండయ్య మాట్లాడుతూ.. గతంలో పీఏసీఎస్‌లో రుణాలు తీసుకోవాడానికి ఇబ్బందులు పడే వారని నేడు రైతులు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. రైతులుకు రుణాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాలను బలోపేతం చేయడానికి నూతన బైలా తయారు చేసినట్లు తెలిపారు. తద్వార సంఘం మరిన్ని నూతన వ్యాపారాలు చేసుకొనుటకు వెసలుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మల్క సూర్య ప్రకాశ్‌రావు, సంఘ పాలక వర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బావిలో క్లోరినేషన్

సాక్షి ఎఫెక్ట్..



క్లోరినేషన్ చర్యలు చేపడుతున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని అప్పాలవారివీధిలోని గ్రామ పంచాయతీ తాగు నీటి బావిలో క్లోరినేషన్ చర్యలు చేయక పోవటంతో 'కలుషిత నీరే దిక్కు' అనే శీర్షికన 'సాక్షి' సోమవారం ప్రచురించింది. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బావి వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి బావిలో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పోషణ మాసంలో పాల్గొన్న సిబ్బంది

ఏటూరునాగారం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఆఫ్రీన్ వైద్యాధికారి సుమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అకులవారి ఘణపురంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవటం వల్ల రక్త హీనత నిర్మూలించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న స్వామిదాస్

ములుగు రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్ అన్నారు. సోమవారం మండలంలోని బండారుపల్లి గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోక్సో, మోటర్ వెహికిల్ చట్టం, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక చట్టంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ అమృత రెడ్డి, ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి

ములుగు రూరల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ జ్యోతి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని మల్లంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బాలలపై లైంగిక నేరాల రక్షణ చట్టం-2012, బాల్య వివాహాల నిరోధక చట్టం -2006 పై అవగాహన కల్పించారు. బాలికలకు, యువతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు కాల్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నాగమణి, జిల్లా మహిళా సాధికారత కేంద్ర జెండర్ స్పెషలిస్టు స్రవంతి, మౌనిక పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న జయరాంరెడ్డి

మంగపేట: మండలంలోని కమలాపురం బిల్టు ఫ్యాక్టరీ వద్ద జరిగిన సంఘటనలకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా విద్యుత్‌ను వాడుకున్న రాధా స్టీల్ కంపనీ కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రాధా స్టీల్ కంపనీ సిబ్బందిమని చెప్పి కంపనీకి కాంగ్రెస్ పార్టీ నాయకులు వత్తాసు పలుకుతున్నారని, మీడియాపై దౌర్జన్యానికి దిగారనే తప్పుడు ప్రచారాన్ని బీఆర్‌ఎస్ నాయకులు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా, మండల నాయకులు అయ్యోరి యానయ్య, చెటుప్పల్లి వెంకటేశ్వర్లు, కారుపోతుల నర్సయ్యగౌడ్, ముత్తినేని ఆదినారాయణ, మురుకుట్ల నరేందర్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కర్రి నాగేంద్రబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు



సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

గోవిందరావుపేట: మండల పరిధిలోని మచ్చాపూర్ గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు పార్టీ సభత్వాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు నీరటి కుమార్, చంద్రమౌళి, సదానందం ఆధ్వర్యంలో నిర్వహించగా మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు హాజరై మాట్లాడారు. దేశ సేవలో తరిస్తున్న బీజేపీ కుటుంబంలో భాగస్వాములు కావాలన్నారు. ఉద్యమాల గడ్డ తెలంగాణలో కమలం విస్తరించేలా సభ్యత్వాలు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.